జగనన్నతోనే ప్రతి కుటుంబం అభివృద్ధి

నల్లపాడులో వైఎస్సార్ సీపీ నేతల ప్రచారం

గుంటూరు రూరల్: జగనన్న ముఖ్యమంత్రిగా ఉంటేనే ప్రతి కుటుంబం సంక్షేమ పథకాలతో అభివృద్ధి చెందుతుందని అర్బన్ క్లస్టర్- 1 కన్వీనర్ ఏటుకూరు విజయసారథి తెలిపారు. 27వ డివిజన్ నల్లపాడులో 170 సచివాలయం పరిధిలో బుధవారం కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలో ప్రజలకు ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల పట్టికను ఆవిష్కరించారు. సచివాలయం పరిధిలో ఇప్పటి వరకూ 25 కోట్ల రూపాయలు ప్రజలకు నేరుగా వారి ఖాతాల్లోకి వెళ్లడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాల్ని వివరించి, ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో మరలా జగనన్ననే ముఖ్యమంత్రిని చేసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కందుకూరి జ్యోతి, గోగులపాటి నాగరాజు, పచ్చల మరియమ్మ, నడవా రజని, నడవ జక్రయ్య, వెంకటేశ్వరరెడ్డి, మణికంత, ప్రదీప్, పరిశుద్ధరావు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన

గొట్టిపాడు (ప్రత్తిపాడు): రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా కన్వీనర్ ఓంప్రకాష్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పెదగొట్టిపాడులో బుధవారం సాయంత్రం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత స్థానిక దళితవాడలో వైఎస్సార్ సీపీ జెండాను పార్టీ నేతలు ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు, అమలు చేస్తున్న అభివృద్ధి పనుల్ని వివరించారు. గత పాలనకు, ప్రస్తుత పాలనకు ఉన్న వ్యత్యాసాలు, జరిగిన సంక్షేమాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఉడుతూరి ఓంప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గతమెన్నడూ జరగని విధంగా ప్రభుత్వం పాలన చేస్తోందని తెలిపారు. నాగార్జున సాగర్ కుడికాలువ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ గుంటుపల్లి వీరభుజంగరాయలు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గొట్టిపాడులో 25 రకాల ప్రత్యక్ష నగదు బదిలీ పథకాల ద్వారా రూ. 29,17,14,904, ఎనిమిది రకాల నాన్ డీబీటీ పథకాల ద్వారా రూ. 11,13,33,451 లబ్ధి చేకూరిందని తెలిపారు. రానున్న ఎన్నికల్లోనూ మనందరి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజల్ని కోరారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా అవినీతికి, ఆస్కారం లేకుండా ఇంత పెద్ద మొత్తంలో పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించడం దేశచరిత్రలోనే ఇది ప్రథమమని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా కన్వీనర్ మురళి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మన్నవ మహేంద్ర, మాజీ సర్పంచ్ దయారత్నం, ప్రత్తిపాడు ఉప సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, పార్టీ నాయకులు గుజ్జుల శివారెడ్డి, కవిత, నాగరాజు పాల్గొన్నారు.


నల్లపాడులో ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న నేతలు


గొట్టిపాడులో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తున్న పార్టీ నాయకులు


పాండ్రపాడులో ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న పార్టీ నేతలు

సంక్షేమ పథకాలను సకాలంలో అందిస్తున్న సీఎం

పాండ్రపాడు(కాకుమాను): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును రెండు కళ్లుగా భావించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని సకాలంలో అందిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని సర్పంచి దేవిరెడ్డి సాంబయ్య తెలిపారు. మండలంలోని పాండ్రపాడులో బుధవారం రాత్రి ఏపీకి జగనే ఎందుకు కావాలంటే ? కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తమ పార్టీకి చెందిన వారికే పథకాలు అందించారని, అది కూడా అరకొరగా అందించినట్లు విమర్శించారు. ప్రస్తుత జగనన్న పాలనలో పార్టీలు, ప్రాంతాలు చూడకుండా అందరికీ అందిస్తున్నారనే విషయం రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. అనంతరం గత నాలుగేళ్లుగా గ్రామంలో వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి వివరాల పట్టికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్, కొల్లిమర్ల సర్పంచి విప్పడపు రాంబాబు, వల్లూరి సుధాకర్, గంగయ్య, వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలి

పెదకాకాని: రాష్ట్రంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతాయని వైఎస్సార్ సీపీ నేతలు స్పష్టం చేశారు. పెదకాకాని ఒకటో సచివాలయంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ (రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే ?) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి ఇంటికీ ఎంత లబ్ధి చేకూరిందో వివరించి బుక్‌లెట్ అందజేయాల్సిన బాధ్యత వలంటీర్లు, స్థానిక నాయకులపై ఉందని చెప్పారు. వలంటీర్లు వారి పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని తెలియజేసి, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగస్వాముల్ని చేయాలని తెలిపారు. ఒకటో సచివాలయం పరిధిలో ప్రజలకు ప్రత్యక్ష నగదు బదిలీ, పరోక్ష ప్రయోజనాల ద్వారా రూ. 19,60,69,240 మంజూరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచి గోళ్ల స్వరూపరాణి, ఎంపీటీసీ సభ్యురాలు షేక్ గుల్జార్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్‌హుస్సేన్, మండల కన్వీనర్ చాగంటి మురళీమోహన్‌రెడ్డి, స్థానిక నాయకులు షేక్ నజీర్, గోళ్ల జోసఫ్, శ్యాం ముఖర్జీబాబు, ఆలపాటి రాఘవ, సుంకర కృష్ణారెడ్డి, వీర్ల వీరాంజనేయులు, కొంకి రామారావు, బందెల ఉదయ్‌శంకర్, ఆలా ప్రసాద్, గడ్డేశ్వరరావు, వలంటీర్లు పాల్గొన్నారు.


పెదకాకాని సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషి


లబ్ధిదారులకు పథకాల పత్రాలు అందజేస్తున్న సర్పంచ్ శిరీష తదితరులు

గుంటూరు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి కుటుంబాన్నీ అభివృద్ధి చేసేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని జొన్నలగడ్డ గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష తెలిపారు. బుధవారం గ్రామంలో భారత్ వికసిత్ సంకల్పయాత్ర సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందిస్తున్న 17 సంక్షేమ పథకాల్ని వివరించారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల్ని అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. ఒక వేళ అర్హత ఉండి పథకాలు అందని వారు మరలా దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏవో సుబ్రహ్మణ్యం, రామాంజనేయులు, సర్వేయర్ రాజు, సెక్రటరీ భూషణం, జీవనజ్యోతి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని కారు మెకానిక్ మృతి

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో కారు మెకానిక్ దుర్మరణం చెందిన సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు వద్ద బుధవారం జరిగింది. పెదకాకాని ప్రాంతానికి చెందిన షేక్ కరీముల్లా(26) కారు మెకానిక్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం పొన్నూరు మండలం తొట్టెంపూడిలోని స్నేహితుడు రాజకుమార్ వద్దకు వెళ్లాడు. అక్కడ నుంచి స్నేహితుడు బుల్లెట్ మీద, మృతుడు కరీముల్లా స్కూటీ మీద పెదకాకాని బయలు దేరారు. మార్గంమధ్యలో నారాకోడూరు గ్రామ శివారులోని కారం మిల్లు ప్రాంతంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ సంఘటనలో కరీముల్లా తలకు బలమైన గాయాలవ్వడంతో అక్కడికక్కడే మరణించాడు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

విద్యార్థులంతా లక్ష్య సాధన దిశగా కృషిచేయాలి



గుంటూరు రూరల్: విద్యార్థులంతా కష్టపడి చదివి లక్ష్య సాధన దిశగా కృషిచేయాలని మండల విద్యాశాఖ అధికారి వీసం వెంకటేశ్వరరావు తెలిపారు. పెదపలకలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. చక్కగా చదివి పరీక్షల్లో మంచి ఫలితాల్ని సాధించాలని చెప్పారు. పాఠశాలలో వసతుల్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు శేషగిరిరావు, నాగార్జునరావు పాల్గొన్నారు.

'జయహో జగన్' పాదయాత్రకు ఘన స్వాగతం



పెదకాకాని: రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించాలని కోరుతూ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేపట్టిన 'జయహో జగన్' తిరుపతి పాదయాత్ర బుధవారం పెదకాకాని చేరింది. విజయనగరం జిల్లా, శృంగవరపుకోట నుంచి నేతలు పాదయాత్ర చేపట్టారు. 43 రోజుల పాటు సాగే 820 కిలోమీటర్లు పాదయాత్రకు పెదకాకానిలో ఘన స్వాగతం లభించింది. సర్పంచి గోళ్ల స్వరూపరాణి, ఎంపీటీసీ సభ్యురాలు షేక్ గుల్జార్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్‌హుస్సేన్, మండల కన్వీనర్ చాగంటి మురళీమోహన్‌రెడ్డి, స్థానిక నాయకులు షేక్ నజీర్, గోళ్ల జోసఫ్, శ్యాం ముఖర్జీబాబు, ఆలపాటి రాఘవ, సుంకర కృష్ణారెడ్డి, వీర్ల వీరాంజనేయులు, కొంకి రామారావు, బందెల ఉదయ్‌శంకర్, ఆలా ప్రసాద్, గడ్డేశ్వరరావు, కిలారి రాజారమేష్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

3న బీహెచ్ హైస్కూలు పూర్వ విద్యార్థినుల సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: బ్రాడీపేట రెండో లైనులోని బండ్లమూడి హనుమాయమ్మ (బీహెచ్) బాలికోన్నత పాఠశాల పూర్వ విద్యార్థినుల సమావేశాన్ని డిసెంబర్ 3న పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు సంఘ చైర్‌పర్సన్ జయశ్రీ , కన్వీనర్ గోవిందరాజుల సంధ్యశ్రీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో 1953 నుంచి ఇప్పటి వరకు చదివి దేశ, విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థినులు హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశానికి రవాణా శాఖ సంయుక్త కమిషనర్ కృష్ణవేణి ముఖ్య అతిథిగా పాల్గొననుండగా, పూర్వ ఉపాధ్యాయుల్ని సత్కరించనున్నట్లు తెలియజేశారు. పూర్వ విద్యార్థినులంతా సమావేశానికి హాజరుకావాలని వారు కోరారు.

ఫార్మసీ సూపర్‌వైజర్‌గా కృష్ణకుమారికి పదోన్నతి



గుంటూరు మెడికల్: జీజీహెచ్ ఫార్మసీ విభాగంలో గ్రేడ్-1 ఫార్మసిస్టుగా విధులు నిర్వహిస్తున్న ఎం.కృష్ణకుమారికి సూపర్‌వైజర్‌గా పదోన్నతి లభించింది. ఆమెను గుంటూరు నుంచి ఒంగోలు డీఎంహెచ్‌వో కార్యాలయానికి బదిలీ చేశారు. గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) డాక్టర్ శోభారాణి బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించి, ఆమెకు పదోన్నతి ఉత్తర్వులు అందజేశారు. గుంటూరు వైద్య కళాశాలలో గ్రేడ్-1 ఫార్మాసిస్టుగా పనిచేస్తున్న పి.నాగేశ్వరరావుకు ప్రమోషన్ ఇచ్చి మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రి సూపర్‌వైజర్‌గా బదిలీ చేశారు. నెల్లూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఎల్.వెంకటేశ్వర్లుకు ఫార్మసీ సూపర్‌వైజర్‌గా ప్రమోషన్ ఇచ్చి ఒంగోలు జీజీహెచ్‌కు బదిలీ చేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో ఆర్డీతోపాటుగా సూపరింటెండెంట్ సుధీర్, సీనియర్ అసిస్టెంట్ బి.అనిల్ శ్యామ్ బాబు పాల్గొన్నారు.

రేపు అక్కినేని ప్రతిభా పురస్కారాల ప్రదానం

పాత గుంటూరు: బందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై డిసెంబర్ 1న అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి పురస్కరించుకొని వివిధ రంగాలలోని విశిష్ట వ్యక్తులకు ప్రతిభా పురస్కారాల్ని ప్రదానం చేయనున్నట్లు యువ కళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు ఆధ్వర్యంలో సినీ నటులు అశోక్ కుమార్, దర్శకులు సీహెచ్. రజిత మూర్తి , వీణా విద్వాంసురాలు ఏ. భారతీదేవి, టీవీ నటులు విడుదల సాంబశివరావు, డాక్టర్ ఎ.ఎస్.ఆర్. పి. సూరిబాబు, కవి ఐనాల మల్లేశ్వరరావు, ఎస్.వి.రామారావుకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఓటుతో సమర్థ నాయకుడిని ఎన్నుకునే అవకాశం

పొన్నూరు: ఓటు హక్కు ప్రాధాన్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, 18 ఏళ్లు నిండిన యువత వెంటనే నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కేదార్‌నాథ్ శ్రీకాంత్ అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని వెల్లలూరులో ఓటు హక్కు ప్రాధాన్యత తెలుపుతూ అధికారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఓటుతోనే సమర్థ నాయకుడిని ఎన్నుకోగలమని తెలిపారు. యువకులంతా ఎన్నికల్లో తప్పకుండా ఓటు వేయాలని ఆయన సూచించారు. ఓటును నమోదు చేసుకునే విధానం, ఓటు పొందాల్సిన ఆవశ్యకత, ప్రాధాన్యతను తెలియజేశారు. అర్హత ఉన్న విద్యార్థులు ఓటును నమోదు చేసుకోవడంతోపాటు తోటి స్నేహితులతో చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

చేబ్రోలులో...

ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ముసాయిదా జాబితాను పరిశీలన చేసుకోవాలని చేబ్రోలు తహసీల్దారు కె.వి.గోపాలకృష్ణ సూచించారు. చేబ్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఓటరు నమోదుపై (స్వీప్) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దారు గోపాలకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కుకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొత్తగా పేరు నమోదు చేసుకోవడానికి ఫాం-6, జాబితాలో పేరును తొలగించడానికి ఫాం-7, నివాసం మార్పు, ఫొటో సవరణలకు ఫాం-8ను దరఖాస్తు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం వి. నాగేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వెల్లలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు


చేబ్రోలులో మాట్లాడుతున్న తహసీల్దారు గోపాలకృష్ణ

స్కూలు ఆయా నిజాయతీ

కొండపాటూరు(కాకుమాను): దొరికిన వస్తువును నిజాయతీగా అప్పగించిన స్కూలు ఆయాను బుధవారం ఎంఈవో కెనడీ, హెచ్‌ఎం శీలం అంకారావు, ఉపాధ్యాయులు సన్మానించారు. మండలంలోని కొండపాటూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి నాలుగు రోజుల కిందట ఆవరణలో బంగారపు లాకెట్‌ను పోగొట్టుకున్నాడు. బుధవారం పాఠశాలను శుభ్రం చేస్తున్న సమయంలో ఆయా దేవరకొండ అన్నామణిమ్మకు ఆభరణం దొరికింది. దాన్ని ఆమె హెచ్‌ఎం శీలం అంకారావుకు అందజేసింది.నిజాయతీ చాటుకున్న ఆయాను పాఠశాల ఆవరణలో ఎంఈవో కె.ఎఫ్.కెనడీ, హెచ్‌ఎం శీలం అంకారావు తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ నాగరాజు, ఉపాధ్యాయులు రవి,ప్రమీలా దేవి,సుధారాణి,రత్న శిరీష తదితరులు సన్మానించారు. ఆభరణాన్ని విద్యార్థి తల్లిదండ్రులకు అందజేశారు.

యూకే గ్రేహౌండ్ క్రోమటోగ్రఫీతో చలపతి ఫార్మసీ ఒప్పందం


ఒప్పంద పత్రాలను అందుకుంటున్న ప్రిన్సిపాల్ రామారావు తదితరులు

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్యతోపాటు ఉన్నత ఉపాధి అవకాశాలు లక్ష్యంగా తమ కళాశాల కృషి చేస్తోందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో బుధవారం యూకేలోని గ్రేహౌండ్ క్రోమటోగ్రఫీ అండ్ ఎలైడ్ కెమికల్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. గ్రేహౌండ్ క్రోమటోగ్రఫీ బిజినెస్ డెవలప్‌మెంట్ ప్రతినిధి విక్టోరియా మెకొటెతో ప్రిన్సిపాల్ రామారావు ఒప్పంద పత్రాల్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేహౌండ్ క్రోమటోగ్రఫీ సహకారంతో సెమినార్స్, ట్రైనింగ్ ప్రోగ్రామ్స్, మీటింగ్స్ అండ్ గెస్ట్ లెక్చర్స్‌ను పరస్పర ఒప్పందంతో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. విద్యార్థుల నైపుణ్యతను బట్టి ప్రతి సంవత్సరం కళాశాల విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించి, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. తమ కళాశాల ఇప్పటికే విశ్వవిద్యాలయాలు, వివిధ ఫార్మా సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి సమస్యలకు బజరంగ్ రక్షణ కవచం


వెంకటకృష్ణాపురంలోని సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ విద్యార్థులతో అంబటి మురళీకృష్ణ

- ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- వెంకటకృష్ణాపురంలో 555 మందికి ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ

పెదకాకాని: కంటి సమస్యల బారిన పడిన వారికి బజరంగ్ ఫౌండేషన్ రక్షణ కవచంలా పని చేస్తుందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా పెదకాకాని మండలంలోని వెంకటకృష్ణాపురంలో బజరంగ్ ఫౌండేషన్ నేత్రజ్యోతి కార్యక్రమం ద్వారా ఉచిత కళ్లజోళ్ల పంపిణీని మురళీకృష్ణ ప్రారంభించారు. గత 11 నెలలుగా వేలాది మందికి 'నేత్రజ్యోతి' ద్వారా వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. వెంకటకృష్ణాపురంలో వారం రోజుల కిందట శిబిరం నిర్వహించామన్నారు. ఇందులో వారిలోప ఆధారంగా 555 మందికి కళ్లజోళ్లు అందజేసినట్లు చెప్పారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు శిబిరం వద్దకు చేరుకునేందుకు ప్రత్యేకంగా వాహనం ఏర్పాటు చేశారు. స్థానిక సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ వద్దకు వెళ్లి విద్యార్థులకు కళ్ళజోళ్లు అందజేశారు.

నేడు సుద్దపల్లిలో బజరంగ్ నేత్రజ్యోతి కళ్లజోళ్ల పంపిణీ

చేబ్రోలు: బజరంగ్ నేత్రజ్యోతిలో భాగంగా గురువారం మండలంలోని సుద్దపల్లిలో ఉచిత కళ్లజోళ్లు పంపిణీ చేయనున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. సుద్దపల్లిలో బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా నవంబర్ 26న నిర్వహించిన నేత్ర జ్యోతి శిబిరంలో 762 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కళ్లజోళ్లు అవసరమైన 689 మందికి సిద్ధం చేశామని చెప్పారు. సుద్దపల్లిలోని సాయిబాబా మందిరం దగ్గర గురువారం సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు మహిళలకు, 5 ఉంచి 7 గంటల వరకు పురుషులకు కళ్లజోళ్లను పంపిణీ చేస్తామని తెలిపారు.

పర్డ్యూ యూనివర్సిటీ 'ఎపిక్స్'కి వీవీఐటీ ఎంపిక

పెదకాకాని: అమెరికాకు చెందిన ప్రతిష్టాత్మక పర్డ్యూ యూనివర్సిటీ ప్రారంభించిన ఎపిక్స్ కార్యక్రమానికి వీవీఐటీ కళాశాల ఎంపికైందని చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీని బుధవారం పర్డ్యూ యూనివర్సిటీ డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ విలియమ్ వోక్స్ సందర్శించారు. విద్యార్థులు, అధ్యాపకులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ సాంకేతిక వినియోగం ద్వారా ప్రపంచ సవాళ్లు అధిగమించేలా విద్యార్థుల్లో నైపుణ్యాల్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వివరించారు. దేశవ్యాప్తంగా 10 విద్యాలయాలు ఎంపిక కాగా వాటిలో వీవీఐటీ కళాశాల ఒకటి కావడం విశేషమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వీవీఐటీ, పర్డ్యూ యూనివర్సిటీ విద్యార్థులు కలసి పర్యావరణం, మానవ సేవలు, విద్య తదితర అంశాల సమస్యల పరిష్కారానికి డిజైన్ థింకింగ్ ద్వారా పరిష్కారాల్ని రూపొందిస్తారని వివరించారు. ఎపిక్స్ కార్యక్రమాన్ని వీవీఐటీలో ప్రారంభిస్తున్నట్లు డాక్టర్ విలియమ్స్ వోక్స్ ప్రకటించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరావు, జాయింట్ సెక్రటరీ మామిళ్లపల్లి శ్రీకృష్ణ, అకడమిక్ డీన్ డాక్టర్ కె. గిరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.


పర్డ్యూ యూనివర్సిటీ డైరెక్టర్, ప్రొఫెసర్ విలియమ్ వోక్స్‌ను అభినందిస్తున్న వాసిరెడ్డి విద్యాసాగర్

కుటుంబ ప్రగతిలో స్త్రీ పాత్ర కీలకం


గుంటూరు రూరల్: కుటుంబం, వ్యక్తి ప్రగతిలో స్త్రీ పాత్ర కీలకమని, సమాజంలో మహిళలకు సరైన గౌరవం కల్పించినప్పుడే అన్ని రంగాల్లో వృద్ధి సాధిస్తామని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో బుధవారం అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మహిళా సాధికారతపై విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళా భద్రత, రక్షణకు ప్రభుత్వాలు అనేక కఠిన చట్టాలు తీసుకొచ్చాయని తెలిపారు. స్త్రీలపై వివక్ష విడనాడినప్పుడే సమాజం అభివృద్ధి దిశగా ముందుకెళ్తుందని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్ తెలిపారు. పిన్సిపాల్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థినులంతా సమస్యల్ని మనోస్థైర్యంతో ఎదుర్కోవాలని సూచించారు. మహిళలు ఇంటికే పరిమితం అనే కొన్ని మూఢ విశ్వాసాల్ని విడనాడేందుకు ప్రజల్లో చైతన్యం కలిగించే దిశగా విద్యార్థులు కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎస్.వి. శ్రీనివాసరావు, కళాశాల ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ కన్వీనర్ జి.సుధావాణి, కో- కన్వీనర్ రాధారాణి, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

అంగరంగ వైభవంగా అష్ట బంధన మహా కుంభాభిషేకం

పొన్నూరు: పట్టణంలోని శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావన్నారాయణ స్వామి దేవస్థానంలో బుధవారం అష్ట బంధన మహా కుంభాభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, లక్ష్మీ సరస్వతి దంపతుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు పరాశరం రఘునాథబాబు నిర్వహణలో తెల్లవారుజామున విష్వక్సేన ఆరాధనతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే దంపతులు శోభాయాత్రగా శ్రీ సాక్షి భావన్నారాయణ దేవస్థానానికి చేరుకొని, స్వామికి దీక్ష వస్త్రాలు సమర్పించారు. వేదమంత్రాలతో శ్రీ భావన్నారాయణ స్వామి, రాజ్యలక్ష్మీ అమ్మవారు, చెన్నకేశవస్వామి, లక్ష్మీనరసింహస్వామి, దాసాంజనేయ స్వామి, విఖనసాచార్యస్వామికి కుంభాభిషేకం నిర్వహించారు. అతిథులకు వస్త్రాలు బహూకరించి సత్కరించారు. అనంతరం అన్న సంతర్పణను ఎమ్మెల్యే రోశయ్య ప్రారంభించారు. వేల సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమాన్ని నిర్వహణ కమిటీ సభ్యులు పులిపాక ప్రసాద్, చీమకుర్తి లక్ష్మీ నరసింహ ప్రభాకర్, శివ నాగేంద్రం, రామనారాయణ, కారుమూరి శ్రీనివాస్, అంబటి పూర్ణ చంద్రశేఖర్, వెంకటేశ్వర గుప్తా, ఆలయ అధికారులు పర్యవేక్షించారు.


కుంభాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే రోశయ్య, లక్ష్మీ సరస్వతి దంపతులు

మహిళ మెడలో గొలుసు చోరీ

గుంటూరు ఈస్ట్: మహిళ మెడలో బంగారు గొలుసు తెంచుకుని ఆగంతకుడు పరారైన సంఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణనగర్‌కు చెందిన అద్దేపల్లి భవాని బుధవారం రైతుబజారుకు వెళ్లారు. కూరగాయలు కొనుగోలు చేసి ఇంటికి వెళ్లే క్రమంలో ద్విచక్ర వాహనం వద్దకు వచ్చారు. ఈ సమయంలో ఓ ఆగంతకుడు భవానీ సమీపానికి వచ్చి ఆమె మెడలోని నాలుగు సవర్ల బంగారు గొలుసు తెంచుకుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా రంగోలి పోటీలు



గుంటూరు మెడికల్: వరల్డ్ ఎయిడ్స్ డేను పురస్కరించుకుని బుధవారం గుంటూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో రంగోలి పోటీలు నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని, అందమైన ముగ్గులతో అలరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు మాట్లాడుతూ హెచ్‌ఐవీపై ప్రజలకు అవగాహన పెరగడం ద్వారా పాజిటివ్ కేసులు బాగా తగ్గుముఖం పట్టాయని తెలిపారు. ఇప్పటికీ మారుమూల గ్రామాల్లో హెచ్‌ఐవీ బాధితులు వివక్షతకు గురవుతున్నారని, దీన్ని రూపుమాపాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎంవో డీపీఎంవో డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీనివాసులు, ఐసీటీసీ జిల్లా సూపర్‌వైజర్ జ్యోతుల వీరాస్వామి పాల్గొన్నారు.